TELANGANA ADDA RNI: TGTEL/25/A0986

# తెలంగాణ అడ్డా

తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం

PUBLISHED: KARIMNAGAR సంపుటి : 02 సంచిక : 55 గురువారం 10-09-2026 ఎడిటర్ :- గద్దె నరేష్, పేజీలు : 04

## చైనా అధ్యక్షుడి పర్యటనకు రంగం సిద్ధం? కీలక భేటీలో దోవల్

- బ్రిక్స్ సదస్సు కోసం భారత్‌కు రానున్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పర్యటనకు అవకాశం
- ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెట్టనున్న జిన్‌పింగ్
- సరిహద్దు అంశాలపై చర్చల కోసం బీజింగ్‌లో అజిత్ దోవల్
- చైనా విదేశాంగ మంత్రితోనూ భేటీ కానున్న జాతీయ భద్రతా సలహాదారు



చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ త్వరలో భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ (దీ=×జూ) సదస్సులో పాల్గొనేందుకు ఆయన సెప్టెంబరు 12, 13 తేదీల్లో ఇక్కడికి రానున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన ఖరారైతే, దాదాపు ఏడేళ్ల సుదీర్ఘ

## యుద్ధానికి ముగింపు పలుకుదాం.. ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడి సందేశం

- శక్తిమంతంగా, గౌరవంగా ఉన్నప్పుడే ముగించడం మేలని వ్యాఖ్య
- అమెరికాను ప్రపంచమంతా ద్వేషిస్తోందన్న పెజెష్కియాన్
- కొనసాగుతున్న ప్రతిష్టంభన.. మధ్యవర్తిత్వం చేస్తున్న ఒమన్



అమెరికాతో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకాలని ఇరాన్ పిలుపునిచ్చింది. తాము శక్తిమంతమైన, గౌరవప్రదమైన స్థితిలో ఉన్నప్పుడే యుద్ధాన్ని ముగించడం మేలని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం వైద్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. "మనం శక్తిమంతంగా, గౌరవంగా ఉన్న ఈ సమయంలోనే యుద్ధానికి ముగింపు పలకడం ఉత్తమం" అని పెజెష్కియాన్ అన్నారు. ఈ పోరాటంలో ఇరాన్ - మిగతా 2 లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేరు కానీ విదేశీ విద్య అందిస్తారంట!



- ఫీజు బకాయిలు అందకపోవడంతో విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారన్న ఆవేదన
- బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్న సంజయ్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. - మిగతా 2 లో

## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?



- 22వ బాధితుల సమావేశానికి హాజరైన హరీశ్ రావు
- లక్షలాది మందికి కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపాటు
- పొంగులేటి అత్యాశ ఆయన దుఃఖానికి కారణమవుతుందని వ్యాఖ్య

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ - మిగతా 2 లో

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర

# కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

- స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య




అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు.

# బెంగళూరులో విజృంభిస్తున్న హెచ్1ఎన్1.. ఢిల్లీ కంటే తీవ్రమా?

- ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో పెరుగుతున్న హెచ్1ఎన్1 కేసులు
- బెంగళూరు వాతావరణం వల్లే వ్యాధి వ్యాప్తి ఎక్కువ కాలం
- ఇది కొత్త రకం వైరస్ కాదని స్పష్టం చేసిన ఐసీఎంఆర్
- యాంటీబయాటిక్స్ సొంతంగా వాడొద్దని వైద్యుల హెచ్చరిక
- వ్యాక్సినేషన్‌తో వ్యాధి తీవ్రతను తగ్గించుకోవచ్చని సూచన




దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, బెంగళూరులలో హెచ్1ఎన్1 (స్వైన్ ఫ్లూ) కేసులు పెరుగుతున్నప్పటికీ, బెంగళూరులో పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉందని చెప్పలేమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## టారిఫ్‌లతోనే అమెరికా ధనిక దేశంగా మారింది



- సుంకాలే తనకెంతో ఇష్టమైన పదమని చెప్పిన అమెరికా అధ్యక్షుడు
- విదేశీ కంపెనీలు అమెరికాలోనే కార్ల ఫ్యాక్టరీలు నిర్మిస్తున్నాయని వెల్లడి
- టారిఫ్‌ల వల్లే దేశంలోకి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని వివరణ
- డెమొక్రాట్లు గెలిస్తే పన్నులు పెరిగి, ఉద్యోగాలు పోతాయని హెచ్చరిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన టారిఫ్‌ల (సుంకాలు) విధానాన్ని బలంగా సమర్థించుకున్నారు. దిగుమతులపై విధించిన సుంకాల - మిగతా 2 లో

## సెప్టెంబర్ 1 నుంచి విమానాశ్రయాల్లో కొత్త రూల్

ఇకపై అంతా డిజిటల్!



- ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల వద్ద ఫిజికల్ బోర్డింగ్ పాస్ తప్పనిసరి కాదు
- డిజిటల్ లేదా ఈ-బోర్డింగ్ పాస్‌తోనే క్లియరెన్స్ పొందవచ్చు
- బోర్డింగ్ పాస్‌పై స్టాంపింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసిన ప్రభుత్వం
- దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఈ మార్పులు అమలు

విదేశాలకు ప్రయాణించే భారతీయులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. - మిగతా 2 లో

## ఆయుర్వేద చికిత్స కోసం కేరళ చేరుకున్న పవన్ కల్యాణ్



- భుజానికి ఆయుర్వేద వైద్యం చేయించుకోనున్న పవన్
- త్రిస్సూర్ సమీపంలోని ఆసుపత్రిలో ప్రత్యేక థెరపీ
- ఇటీవలే భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న జనసేనాని
- కొచ్చి విమానాశ్రయం నుంచి నేరుగా ఆసుపత్రికి పయనం

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కేరళ చేరుకున్నారు. - మిగతా 2 లో

# ఏపీలో కీలక రహదారికి కేంద్రం నిధులు మంజూరు

- గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు
- ఎన్డీఏ డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వంతోనే అభివృద్ధి అన్న సీఎం చంద్రబాబు
- ఏపీలో జాతీయ రహదారికి రూ. 840 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి
- పోలవరం, గోదావరి ఘాట్లకు మెరుగుపడనున్న కనెక్టివిటీ
- రైతులు, భక్తులకు లబ్ధి చేకూరుస్తుందని హర్షం




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కీలకమైన జాతీయ రహదారి

## నారా లోకేశ్ విద్యార్థుల్లో విద్యార్థిగా టీచర్లలో టీచర్ గా..!



- విద్యావ్యవస్థలోని సమస్యలను తెలుసుకునేందుకు మంత్రి లోకేశ్ వినూత్న ప్రయత్నం
- విద్యార్థులతో విద్యార్థిలా, ఉపాధ్యాయులతో ఉపాధ్యాయుడిలా మమేకం
- విశాఖలో ఆధునీకీకరించిన పాఠశాలను ప్రారంభించి, విద్యార్థులతో సరదాగా ముచ్చట
- విజయనగరంలో ఉపాధ్యాయులతో కలిసి కెమిస్ట్రీ క్లాస్‌లో కూర్చున్న వైనం

విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు రాష్ట్ర విద్యాశాఖ - మిగతా 2 లో

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం
గురువారం 10- 09 - 2026

## ఆయుర్వేద చికిత్స కోసం కేరళ చేరుకున్న పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి – ఇటీవల ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న తన కుడి భుజానికి తదుపరి చికిత్సలో భాగంగా ఆయన ఆయుర్వేద వైద్యాన్ని ఆశ్రయించారు. శనివారం సాయంత్రం కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా త్రిస్సూర్ బయలుదేరి వెళ్లారు. త్రిస్సూర్ సమీపంలో ఉన్న ఒక ప్రముఖ ఆయుర్వేద వైద్యశాలలో పవన్ కల్యాణ్ చేరారు. అక్కడ ప్రత్యేక థెరపీ ద్వారా ఆయనకు చికిత్స అందించనున్నారు. కొంతకాలంగా భుజం నొప్పితో బాధపడుతున్న పవన్ కల్యాణ్‌కు ఇటీవలే శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా, పూర్తిస్థాయిలో కోలుకునేందుకు ఆయన ఈ ఆయుర్వేద చికిత్స తీసుకోనున్నట్లు సమాచారం. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని, చికిత్స పూర్తయ్యే వరకు ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉండనున్నారని తెలుస్తోంది. పవన్ కల్యాణ్ వెంట పార్టీకి చెందిన కొందరు ముఖ్య నేతలు కూడా కేరళ వెళ్లినట్లు సమాచారం.ဝ

## తెలంగాణ విద్యార్థులంటే లెక్కలేదా?.. రాహుల్ గాంధీపై కేటీఆర్, కవిత ఫైర్

మొదటిపేజీ తరువాయి – ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో విద్యార్థుల కోసం ధర్నా చేసిన రాహుల్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన తెలంగాణలో జరుగుతున్న దాడులపై స్పందించకపోవడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వారు ఆరోపించారు. శుక్రవారం కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ రాహుల్ గాంధీ తీరును తప్పుబట్టారు. "దేశంలో రెండు రకాల భారతాలు ఉన్నాయి. ఒకచోట విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగితే రాహుల్ గాంధీ ప్రశ్నిస్తారు, ధర్నాలు చేస్తారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ఉన్న తెలంగాణలో విద్యార్థులను ఈడ్చుకెళ్తూ, గొంతు పట్టుకొని హింసిస్తున్నా పట్టించుకోరు. ఢిల్లీ తరహాలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు రాహుల్ గాంధీ ధర్నా చేస్తారా? లేక తెలంగాణ విద్యార్థులంటే మీకు లెక్కలేదా?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీ కవిత కూడా స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 19న మహబూబాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థి గొంతును ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పట్టుకున్న వీడియోను ప్రస్తావిస్తూ ఆమె విమర్శలు గుప్పించారు. "ఢిల్లీ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎఫ్ఐఆర్ కోసం వెళ్లిన రాహుల్, తెలంగాణ ఘటనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఇక్కడి విద్యార్థులను నేరస్థుల్లా చూస్తున్నారు. ఢిల్లీకి మీ ఆవేశం, తెలంగాణకు మీ మౌనం.. విద్యార్థులు మీ నుంచి ఇంతకంటే మెరుగైన తీరును ఆశిస్తున్నారు" అని కవిత అన్నారు.ဝ

## మంత్రి కొండా సురేఖపై వేటుకు రంగం సిద్ధం?

మొదటిపేజీ తరువాయి – విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యల వివాదం, పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ మేరకు అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుంది. కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఇటీవల సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డిని అహంకారిగా అభివర్ణిస్తూ, తెలంగాణ కాంగ్రెస్‌ను 'తెలుగుదేశం కాంగ్రెస్'గా మార్చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసు ఇవ్వగా, తన కుమార్తె వ్యాఖ్యలు వ్యక్తిగతమని, వాటితో తనకు సంబంధం లేదని ఆమె బదులిచ్చారు. అయితే, కుమార్తె వ్యాఖ్యలను ఖండించకపోవడం, సీఎం పాల్గొన్న కార్యక్రమాలకు గైర్హాజరు కావడం వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ పరిణామాల మధ్య, ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాలకు చెందిన సుమారు 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం సమావేశమయ్యారు. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి, పార్టీ నుంచి తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఇలయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం వంటి నేతలు మాట్లాడుతూ.. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే అంతర్గత విమర్శలపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సురేఖపై చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. ఈ నిర్ణయాన్ని అధిష్ఠానం ఇప్పటికే సీఎంకు తెలియజేసింది. సీఎం తిరిగి రాగానే గవర్నర్‌కు సిఫార్సు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం తిరిగి రానున్నారు. ఆయన వచ్చాక తుది నిర్ణయం తీసుకుంటారు.

## సెప్టెంబర్ 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

అయితే, ఈ సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయి, సభా అజెండా ఏమిటన్న అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఒక కీలక తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ సభలో తీర్మానం చేయనున్నారు. అనంతరం దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపి, పార్లమెంటులో సంబంధిత బిల్లును ప్రవేశపెట్టాలని కోరనున్నారు. చట్టసభల్లో యువతకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ మార్పును ప్రతిపాదిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే పేర్కొన్నారు. నియోజకవర్గాల అభివృద్ధి పనులపై కూడా ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్ష జరిపారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆయన ఎమ్మెల్యేలను ఆదేశించారు. భూసేకరణలో జాప్యం జరిగితే ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భూసేకరణ, పునరావాసం, అటవీ శాఖ అనుమతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి ఎమ్మెల్యే తమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలి?

మొదటిపేజీ తరువాయి – రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ (22ఎ) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. "భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం




**కరీంనగర్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులు, రిసెప్షన్ కౌంటర్, పౌరుల స్పందన (సిటిజన్ ఫీడ్‌బ్యాక్) వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పరిశీలించిన సీపీ, క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్), ఈ-సాక్ష్య, సమన్వయ వంటి సాంకేతిక పోర్టల్స్, అప్లికేషన్ల పనితీరును సమీక్షించారు. నేర పరిశోధన, రోజువారీ పోలీసింగ్‌లో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ప్రజలకు సత్వర న్యాయం అందేలా చూడాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, సబ్ ఇన్‌స్పెక్టర్ సాంబమూర్తితో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నారా లోకేశ్.. విద్యార్థుల్లో విద్యార్థిగా.. టీచర్లలో టీచర్ గా..! ఫొటోలు ఇవిగో!

మొదటిపేజీ తరువాయి – మంత్రి నారా లోకేశ్ అనుసరిస్తున్న వినూత్న పంథా అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయ పర్యటనలకు భిన్నంగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా ఆయన నేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మమేకమవుతున్నారు. వారిలో ఒకరిగా కలిసిపోయి, సమస్యలను అడిగి తెలుసుకుంటూ అక్కడికక్కడే పరిష్కారాలకు చొరవ చూపుతున్నారు. "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" రూపకల్పనే లక్ష్యంగా ఆయన చేస్తున్న ఈ ప్రయత్నం విద్యావర్గాల్లో కొత్త ఆశలు రేపుతోంది. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ సంస్థ సహకారంతో ఆధునీకరించిన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. గతంలో తాను ఈ పాఠశాలను సందర్శించినప్పుడు క్రీడా మైదానం మోకాలి లోతు నీటిలో ఉండటాన్ని గమనించారు. విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని, దివీస్ యాజమాన్యంతో మాట్లాడి అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలను అభివృద్ధి చేసేలా ఒప్పించారు. నేడు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారిన తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆధునాతన ప్లేగ్రౌండ్‌ను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ప్రసంగాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు మైక్ అందించి వారి అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకున్నారు. వారు అడిగిన సరదా ప్రశ్నలకు అంతే ఉత్సాహంగా సమాధానాలిచ్చి వారిలో ఒకరిగా కలిసిపోయారు. అనంతరం విజయనగరం పర్యటనలోనూ లోకేశ్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. దాసన్నపేట బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్



సమావేశానికి ఆయన హాజరయ్యారు. అక్కడ ఉపాధ్యాయులకు కెమిస్ట్రీపై పునశ్చరణ తరగతులు జరుగుతుండగా, వారికి ఎలాంటి ఆటంకం కలిగించకుండా నిశ్శబ్దంగా వెళ్లి ఉపాధ్యాయుల మధ్య కూర్చున్నారు. శ్రద్ధగా పాఠం వింటూనే, విరామ సమయంలో వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన అంశాలపై తక్షణమే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కార మార్గాలను అన్వేషించారు. మంత్రి హోదాను పక్కనపెట్టి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకునేందుకు లోకేశ్ అనుసరిస్తున్న ఈ ఆచరణాత్మక విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమస్యల పరిష్కారం పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని అభిప్రాయపడుతున్నారు.

# ఏపీలో నిరుద్యోగులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి – ప్రభుత్వ ప్రాధాన్యతలైన మౌలిక సదుపాయాల కల్పన, విద్య, సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని, "స్వర్ణాంధ్రఏ2047" లక్ష్యాలకు అనుగుణంగా ఈ పోస్టుల భర్తీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మొత్తం 10,060 పోస్టులను నాలుగు దశల్లో భర్తీ చేయనుండగా, వాటి షెడ్యూల్ కింది విధంగా ఉంది:

మొదటి విడత: 1,523 పోస్టులు (ఇప్పటికే ఉన్నత విద్యా శాఖ 2026 మే 15న నోటిఫికేషన్ జారీ చేసింది).

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 సెప్టెంబర్ 15).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్ తేదీ: 2026 అక్టోబర్ 15).

ఇప్పటికే తొలి దశ నోటిఫికేషన్ జారీ కాగా, మిగతా మూడు దశల వివరాలు ఇవిగో!

రెండో విడత: 3,231 పోస్టులు (నోటిఫికేషన్: 2026 సెప్టెంబర్ 15)

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్-1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

సెప్టెంబర్‌లో జారీ చేయనున్న ఈ నోటిఫికేషన్‌లో గ్రూప్-1 సర్వీసులతో పాటు పోలీస్ శాఖలో అత్యధిక పోస్టులు ఉన్నాయి.

గ్రూప్-1 సర్వీసులు (149 పోస్టులు): డిప్యూటీ కలెక్టర్: 11 డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ): 36 అసిస్టెంట్ కమిషనర్ (ఏసీటీ): 14 మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-××: 12 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 35 డిప్యూటీ రిజిస్ట్రార్ (సహకార శాఖ): 10

ఇతర కీలక పోస్టులు (3,082): పోలీస్ శాఖ: సివిల్ ఎస్సై (182), ఏఆర్ ఎస్సై (116), సివిల్ కానిస్టేబుల్స్ (542), ఏఆర్ కానిస్టేబుల్స్ (205), కమ్యూనికేషన్ కానిస్టేబుల్స్ (200), ఏపీఎస్పీ ఎస్సై (71), ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ (80) సహా మొత్తం 1,500కు పైగా పోస్టులున్నాయి.

ఇతర శాఖలు: వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (164), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (196), ఫైర్‌మెన్ (158), జైలు వార్డర్లు (171), హార్టికల్చర్ ఆఫీసర్ (45), ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-××× (దేవాదాయ శాఖ) (104).

మూడో విడత: 2,311 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ దశలో గ్రూప్-2, ఇంజనీరింగ్, ప్రొహిబిషన్ శాఖల్లోని కీలక పోస్టులను భర్తీ చేయనున్నారు.

గ్రూప్-2 సర్వీసులు (673 పోస్టులు): డిప్యూటీ తహశీల్దార్: 200 డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్: 176 గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్ (జీఎస్టీఓ): 40 ప్రొహిబిషన్ ఛ ఎక్సైజ్ సబ్-ఇన్‌స్పెక్టర్: 25 సబ్-రిజిస్ట్రార్ గ్రేడ్-××: 7 సచివాలయం, హెచ్‌ఓడీలలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు, అకౌంటెంట్లు.

ఇంజనీరింగ్, ఇతర పోస్టులు (1,638): అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ): ఇరిగేషన్ (224), పంచాయతీరాజ్ (100), గ్రామీణ నీటి సరఫరా (73), ఆర్‌డబీ (75) సహా పలు శాఖల్లో మొత్తం 428 పోస్టులు.

విద్యుత్ సంస్థల్లో ఏఈఈలు: ఏపీ ట్రాన్స్‌కో (200), ఏపీ జెన్‌కో (100), డిస్కంలు (మొత్తం 329) కలిపి 629 పోస్టులు.

ఇతరాలు: ప్రొహిబిషన్ ఛ ఎక్సైజ్ కానిస్టేబుల్ (400), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (50).

నాలుగో విడత: 2,995 పోస్టులు (నోటిఫికేషన్: 2026 అక్టోబర్ 15)

ఈ విడత దాదాపు పూర్తిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి (మెగా డీఎస్సీ) కేటాయించారు.

పాఠశాల విద్యా శాఖ (2,991 పోస్టులు): సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్లు, ఇన్‌స్ట్రక్టర్లు, డీఈవో పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల వివరాలను సంబంధిత డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు.

**వయోజన విద్య: అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 4 ఉన్నాయి.**

ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం, సంబంధిత శాఖలు వెంటనే ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లు, అర్హతలకు సంబంధించిన సమాచారాన్ని నియామక సంస్థలకు అందించాలని ఆదేశించారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్, రిజర్వేషన్ పాలసీ, సర్వీస్ రూల్స్‌ను కచ్చితంగా పాటిస్తూ నియామక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ భారీస్థాయి నియామక ప్రకటనతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులలో కొత్త ఆశలు చిగురించాయి..

## ఏపీలో కీలక రహదారికి కేంద్రం నిధులు మంజూరు



మొదటిపేజీ తరువాయి – అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఎన్డీఏ డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం, మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధిని అందిస్తోందని చంద్రబాబు కొనియాడారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి-365దీదీ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ. 840.41 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కేంద్రమంత్రి గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా పోలవరం ప్రాజెక్టుకు రవాణా సౌకర్యం మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పొగాకు, చెరకు, పామాయిల్, ఆక్వా రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా తరలించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బుట్టాయిగూడెం--ఎల్ఎన్‌డీ పేట, పత్తిసీమ--కొవ్వూరు మధ్య 45.09 కిలోమీటర్ల మేర రహదారిని పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు వరుసలుగా విస్తరించనున్నారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలు బలపడతాయని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం లభిస్తుందని సీఎం చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నాటికి భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ రహదారి నిర్మాణం దోహదపడుతుందని తెలిపారు. కేంద్రమంత్రి గడ్కరీ తన ప్రకటనలో, ఈ రహదారి విస్తరణతో పోలవరం ప్రాజెక్టుతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయపరంగా కీలకమైన ఈ ప్రాంతంలో ఉత్పత్తుల రవాణా వేగవంతం కావడం వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా, గోదావరి నది వెంబడి ఉన్న పుణ్యక్షేత్రాలకు, స్నానఘట్టాలకు భక్తులు సులభంగా చేరుకునేందుకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలో వ్యవసాయం, పర్యాటకం, వాణిజ్యం, తీర్థయాత్రలతో పాటు సామాజిక-ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు అవుతుందని కేంద్రం భావిస్తోంది.

## బెంగళూరులో విజృంభిస్తున్న హెచ్1ఎన్1.. ఢిల్లీ కంటే తీవ్రమా?

మొదటిపేజీ తరువాయి – రెండు నగరాల మధ్య నిఘా వ్యవస్థ, పరీక్షల నిర్వహణ తీరు, వాతావరణ పరిస్థితుల్లోని వ్యత్యాసాల కారణంగానే కేసుల సంఖ్యలో ఈ తేడాలు కనిపిస్తున్నాయని వారు వివరిస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఆగస్టు 20 నాటికి ఢిల్లీలో 1,777 కేసులు నమోదయ్యాయి. మరోవైపు, బెంగళూరులోని ఒక పాఠశాలలో 500 మందికి పైగా విద్యార్థులు, సిబ్బంది ఫ్లూ లక్షణాలతో బాధపడగా, వారిలో ఇద్దరికి స్వైన్ ఫ్లూ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అయితే, ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్నది కొత్త రకం వైరస్ కాదని, అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ల ద్వారా నివారించదగ్గ పాత స్ట్రెయిన్ మాత్రమేనని ఐసీఎంఆర్ స్పష్టం చేసింది. బెంగళూరు వాతావరణం కారణంగా ఇక్కడ శ్వాసకోశ సంబంధిత వైరల్ ఇన్ఫెక్షన్లు ఎక్కువ కాలం ప్రభావాన్ని చూపుతాయని ఆస్టర్ వైట్‌ఫీల్డ్ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ ఐశ్వర్య తెలిపారు. సాధారణంగా జూన్ నెలలో ప్రారంభమయ్యే ఈ కేసులు, జనవరి-ఫిబ్రవరి వరకు కొనసాగుతాయని, దీనివల్ల వ్యాధి వ్యాప్తి సుదీర్ఘకాలం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం పొడి దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, కండరాల నొప్పులు, తీవ్రమైన నీరసం వంటివి ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులతో పాటు ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాల సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో



బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, సొంతంగా యాంటీబయాటిక్స్ వాడకూడదని హెచ్చరిస్తున్నారు. వ్యాక్సినేషన్ తీసుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను, ఆసుపత్రిలో చేరాల్సిన ముప్పును తగ్గించుకోవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు.

## టారిఫ్‌లతోనే అమెరికా ధనిక దేశంగా మారింది

మొదటిపేజీ తరువాయి – వల్లే అమెరికా అత్యంత ధనిక దేశంగా మారిందని, విదేశీ కంపెనీలు తమ తయారీ యూనిట్లను అమెరికాకు తరలించాల్సి వస్తోందని ఆయన స్పష్టం చేశారు. సౌత్ కరోలినాలోని మిర్టిల్ బీచ్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. "నాకు అత్యంత ఇష్టమైన పదం టారిఫ్. ఆ పదాన్ని నేను ప్రేమిస్తున్నాను. అది మనల్ని విపరీతంగా ధనవంతుల్ని చేసింది" అని వ్యాఖ్యానించారు. సుంకాల విధానం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, అమెరికన్లకు ఉద్యోగాలు కూడా లభిస్తున్నాయని ఆయన తెలిపారు. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు తాను ఒకటే చెబుతున్నానని ట్రంప్ అన్నారు. "అమెరికాకు కార్లను ఎగుమతి చేయాలంటే 25 శాతం సుంకం కట్టాలి. అది సాధ్యం కాదంటే, ఇక్కడికే వచ్చి మీ కార్ల ఫ్యాక్టరీలను నిర్మించుకోవాలి. ఇప్పుడు సౌత్ కరోలినాలో అదే జరుగుతోంది" అని ఆయన వివరించారు. ఈ విధానం వల్ల దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో మాన్యుఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్ పెట్టుబడులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ విధానాల వల్ల అమెరికాలోకి సుమారు 19.2 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయని ట్రంప్ తెలిపారు. దేశవ్యాప్తంగా వందల, వేల సంఖ్యలో ఫ్యాక్టరీలు



నిర్మిస్తుండటంతో నిర్మాణ రంగంలో ఉద్యోగాలు భారీగా పెరిగాయని అన్నారు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు గెలిస్తే తాను తెచ్చిన పన్ను, వాణిజ్య విధానాలు తలకిందులవుతాయని, ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల నియంత్రణ కొనసాగేందుకు తమ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు.

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం
గురువారం 10- 09 - 2026

## హుజురాబాద్‌లో అగ్రిమాల్ ఫెర్టిలైజర్ షాపును ప్రారంభించిన కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** హుజురాబాద్ మండల కేంద్రంలోని రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని అగ్రిమాల్ యాజమాన్యాన్ని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు. హుజురాబాద్ పట్టణంలోని డిపో క్రాస్ వద్ద హుజురాబాద్ అగ్రిమాల్ ఫెర్టిలైజర్ షాపును కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించిన అన్ని సేవలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, పట్టణ సీఐ కరుణాకర్, పట్టణ, మండల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్--బీఆర్ఎస్ దొంగనాటకాల వల్లే ప్రజా సమస్యలు గాలికొదిలేశారు: జనసేన నేత డా. బండారి రాజ్ కుమార్



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** కాంగ్రెస్--బీఆర్ఎస్ రాజకీయ దొంగనాటకాలకు ప్రజల సమస్యలు బలవుతున్నాయని జనసేన నేత డా. బండారి రాజ్ కుమార్ మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు జనసేన ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరగా పోలీసులు నాయకులను అడ్డుకుని అరెస్ట్ చేశారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించడం నేరమా అని, కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి కూడా అవకాశం ఇవ్వరా అని డా. బండారి రాజ్ కుమార్ ప్రశ్నించారు. అరెస్టులతో జనసేన గొంతును నొక్కలేరని, ప్రజల కోసం తమ పోరాటం మరింత ఉధృతమవుతుందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో రాజకీయ డ్రామాలు పక్కనపెట్టి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, లేదంటే ప్రజల పక్షాన జనసేన పార్టీ రోడ్డెక్కి పోరాడుతుందని హెచ్చరించారు. ఈ ఆందోళనలో డా. బండారి రాజ్ కుమార్‌తో పాటు జనసేన పార్టీ సీనియర్ నాయకులు వొడ్నాల రాజు, అంబాల సృజన్ కుమార్, జనార్ధన్, నమిత బాద్, నాగిశెట్టి రంజిత్ కుమార్, తేలుకుంట్ల శ్రీనివాస్, బర్ల అన్వేష్, ఉప్పులేటి శ్రీకాంత్, తేలికుంట్ల రాజు, పవర్ బాలు, నర్సింగ్ ఓజు శ్రీనివాస్, తగరపు శ్రీనివాస్, కొండ సంతోష్ తదితరులు అరెస్టయ్యారు.

## ప్రజాకవి కాళోజి జయంతి వేడుకలు.. రేకుర్తిలో విగ్రహానికి నివాళులర్పించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** పద్మభూషణ్ కాళోజి నారాయణ రావు 112వ జయంతి సందర్భంగా రేకుర్తి 19వ డివిజన్‌లోని కాళోజి విగ్రహానికి కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాలలు వేసి ఆ మహనీయునికి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ యాస, భాషను తన రచనలతో ఎలుగెత్తి చాటిన గొప్ప ప్రజాకవి కాళోజి నారాయణ రావు అని మేయర్ కొనియాడారు. తెలంగాణ భాషలోని మధురత్వాన్ని ప్రపంచానికి చాటిన ఆయనను నేటితరం ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ గౌడ్, కాళోజీ నగర్ కాలనీల అధ్యక్షులు రమణారెడ్డి నారాయణ రెడ్డి మరియు పలువురు డివిజన్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## దళితబంధు లబ్ధిదారుల అకౌంట్ నుంచి ఒక్క రూపాయి కూడా పోలేదు: హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** దళిత బంధు నిధుల విషయంలో దళితులను మోసం చేసి వారికి నిధులు రాకుండా అడ్డుకున్న వ్యక్తి బీఆర్ఎస్ నేత కౌశిక్ రెడ్డి అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా కొత్త డ్రామాకి తెరలేపుతూ, దళిత బంధు లబ్ధిదారుల అకౌంట్ లో ఉన్న 50 కోట్ల రూపాయలను వెనక్కి తీసుకున్నారంటూ కౌశిక్ రెడ్డి చేస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. అబద్ధాలు ఆడటంలో కౌశిక్ రెడ్డిని మించిన వారు లేరని విమర్శించారు. లబ్ధిదారుల అకౌంట్లలో ఉన్న డబ్బులను వెనక్కి తీసుకున్నామని కౌశిక్ రెడ్డి నిరూపించకపోతే, ఆయన తన పదవికి రాజీనామా చేసి, ముక్కు నేలకు రాసి దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వొడితల ప్రణవ్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఓట్ల కోసం దళితులను వాడుకున్నారే తప్ప, నిజంగా వారి సంక్షేమం కోసం ఆలోచించేవారైతే ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఆయన ఎందుకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయించలేదని ప్రశ్నించారు. మొదటి నుండి బీఆర్ఎస్ పార్టీ, కౌశిక్ రెడ్డి దళిత సమాజానికి వ్యతిరేకమని ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దళితబంధు నిధులు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని, త్వరలోనే నిధులు విడుదల చేస్తామని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్సీలు కోదండరామ్, శ్రీపాల్ రెడ్డి



**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలు, ప్రజా సంక్షేమం మరియు ప్రజా ప్రయోజనకరమైన పలు అంశాలపై గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారితో వివరంగా చర్చించడం జరిగింది. ఈ మేరకు తెలంగాణ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ గారు మరియు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి గారు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**రామగుండం ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గర్మిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది విద్యార్థులకు షీ టీమ్ విధులు, లక్ష్యాలు, మహిళలు మరియు బాలికల భద్రత కోసం అందిస్తున్న సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరంగా వివరించారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, అనుమానాస్పద మెసేజ్‌లు, కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, వాటి వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రహదారి భద్రతపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. విద్యార్థులు లేదా మహిళలు ఎలాంటి ఆపద, వేధింపులు లేదా సమస్యను ఎదుర్కొన్నా వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ వాట్సాప్ నంబర్ 8712659385ను సంప్రదించాలని సూచించారు. ఈ నంబర్లను విద్యార్థులు తమ ఫోన్లలో సేవ్ చేసుకోవడంతో పాటు, అవసరమైన వారికి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుళ్లు వనిత, సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజ వర్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి: రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్



**కరీంనగర్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రతి జిల్లాకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని రాష్ట్ర యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, జ్ఞాన భారతం మిషన్ అమలుపై హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఈ సమావేశంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రతి జిల్లాకు నోడల్ పర్యాటక అధికారులను నియమించాలని, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ద్వారా సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, సైన్‌బోర్డులు, శిక్షణ పొందిన గైడ్లు, ఫుడ్ కోర్టులు, దివ్యాంగులకు అనుకూలమైన మార్గాలు వంటి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. సినిమాల చిత్రీకరణకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని, విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 142 వీకెండ్ గేట్‌వే పర్యాటక ప్రాంతాలను గుర్తించామని, ప్రతి జిల్లా మూడు సంవత్సరాల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. జ్ఞాన భారతం మిషన్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాల్లో అందుబాటులో ఉన్న ప్రాచీన గ్రంథాలు, రాత ప్రతులను గుర్తించి డిజిటలైజ్ చేయాలని, భాషా నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టూరిజం శాఖ డీఈ శ్రీశైలం, డీవైఎస్ఓ రాందాస్, డీటీసీపీఓ అన్సార్, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్‌లు, బైక్ దొంగతనాల కేసుల ఛేదన.. నిందితుడు అరెస్ట్



**పెద్దపల్లి ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** పెద్దపల్లి పట్టణంలో వరుసగా చోటుచేసుకున్న చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భవారియా తెగకు చెందిన నిందితుడు కలిరామ్ (38)ను పోలీసులు అరెస్ట్ చేయగా, మరో నిందితుడు కపిల్ పరారీలో ఉన్నాడు. నిందితులు ఇద్దరూ ఉత్తరప్రదేశ్ నుంచి రైలులో వివిధ ప్రాంతాలకు వచ్చి, ముందుగా ఇళ్ల బయట లేదా బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించేవారు. ఆ బైక్‌లపై తిరుగుతూ రోడ్లపై ఒంటరిగా కనిపించే మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడలోని బంగారు పుస్తెలతాళ్లు, చైన్లు లాక్కొని పారిపోవడం వీరి నేర విధానంగా పోలీసులు గుర్తించారు.

నిందితుల నేర ప్రస్థానం: గతంలో పాల వ్యాపారం చేసుకునే కలిరామ్, తన స్నేహితుడు కపిల్‌తో కలిసి జల్సాల కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ నేరాలకు పాల్పడ్డాడు. ఉత్తరప్రదేశ్ నుంచి రైలులో వచ్చి బైక్ దొంగిలించడం, దానిపై తిరుగుతూ చైన్ స్నాచింగ్ చేయడం, ఆ తర్వాత ఆభరణాలను విక్రయించి తిరిగి రైలులో యూపీకి వెళ్లడం వీరి మోడస్ ఆపరేండి.

మార్చి 30, 2026: పెద్దపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైల్వే కాలనీలో ఒక పల్సర్ బైక్ దొంగిలించారు. అదే బైక్‌పై రామగుండం వైపు వెళ్తూ బంధంపల్లిలో గుండు నర్సమ్మ, ఓల్డ్ బజార్‌లో కోల కుసుమ మెడలోని బంగారు పుస్తెలతాళ్లను లాక్కొని పరారయ్యారు. అనంతరం బైక్‌ను బల్హార్ష వద్ద వదిలి యూపీకి వెళ్లిపోయారు.

మే 29, 2026: తిరిగి వచ్చి పెద్దపల్లి బస్‌స్టాండ్ ముందు మరో పల్సర్ బైక్ దొంగిలించినా, స్నాచింగ్‌కు అవకాశం దొరకకపోవడంతో దానిని బెల్లంపల్లి వద్ద దాచి యూపీకి వెళ్ళిపోయారు.

ఆగస్టు 17, 2026: మళ్లీ పెద్దపల్లికి వచ్చి కాలేజీ మైదానం సమీపంలో బైక్ దొంగిలించి, లక్ష్మీనగర్‌లో నూనె స్వరూప మెడలోని బంగారు పుస్తెలతాడును తెంపుకుని పారిపోయారు.

సాంకేతిక ఆధారాలతో గుర్తింపు: వరుస ఘటనలపై రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ జి. కృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన భవారియా తెగవారాక గుర్తించారు. నిందితులు తిరిగి పెద్దపల్లికి వస్తున్నారనే సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. గతంలో దొంగిలించి బెల్లంపల్లి వద్ద దాచిన పల్సర్ బైక్‌ను తీసుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చిన కలిరామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న కపిల్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పెద్దపల్లి సీఐ కె. ప్రవీణ్ కుమార్, ఎస్ఐ కె. నరేష్, సీసీఎస్ ఎస్ఐ ఎం.డి. నసీర్, హెచ్‌సీ కె. సుధాకర్, పీసీలు కె. ప్రభాకర్, కె. విజయ్ కుమార్, బి. ప్రేమ్ సాగర్‌లను డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ జి. కృష్ణ అభినందించారు. ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్క్ చేసుకోవాలని, మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ఏసీబీకి చిక్కిన సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామావత్ గోవింద్‌రామ్



**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామావత్ గోవింద్‌రామ్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సంగారెడ్డిలోని వికాస్ వొకేషనల్ జూనియర్ కళాశాలకు ప్రొవిజనల్ అఫిలియేషన్ రెన్యువల్ కోసం ఇన్‌స్పెక్షన్ నిర్వహించి నివేదిక సమర్పించేందుకు ఆయన లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. మొత్తం రూ.2.50 లక్షలు డిమాండ్ చేసిన ఆ అధికారి, ఇప్పటికే విడతల వారీగా రూ.30 వేలు లంచంగా తీసుకున్నాడు. బుధవారం తన కార్యాలయంలో మరో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రజా విధులను సక్రమంగా నిర్వహించకుండా అక్రమ లబ్ది పొందాలని చూసిన ఆ అధికారిని అరెస్టు చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచామని, ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో సెప్టెంబర్ 15 నుంచి నేత్ర పరీక్షా శిబిరాలు



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి/ తెలంగాణ అడ్డా:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమగ్ర నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు సెప్టెంబర్ 15 నుంచి ప్రత్యేక నేత్ర పరీక్షా శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంపై వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలతో ఆమె అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ "నో స్కూల్ లెఫ్ట్ -- నో చైల్డ్ లెఫ్ట్" అనే లక్ష్యంతో జిల్లాలోని ఏ ప్రభుత్వ పాఠశాల కూడా నేత్ర పరీక్షలకు దూరం కాకుండా, ఏ విద్యార్థి కూడా నేత్ర సమస్యలతో మిగిలిపోకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో దృష్టి లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు, కళ్లద్దాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో నేత్ర పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించి, వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, వైద్య సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నాగేందర్ బాబు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నయీమ్‌జహా, డాక్టర్ సంపత్ కుమార్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, డీపీఓ ఎన్‌హెచ్ఎం రాజేందర్, వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

### విద్యార్థులు, తల్లిదండ్రులు, అవసరమైన వారికి ఉచిత వైద్య సేవలు







**బొల్లారం, సెప్టెంబర్ 9 (తెలంగాణ అడ్డా -- జిన్నారం ప్రతినిధి):** ది మాస్టర్‌మైండ్స్ స్కూల్, ఐడీఏ బొల్లారం బ్రాంచ్ ఆధ్వర్యంలో శ్రీకర హాస్పిటల్స్ సహకారంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అవసరమైన వారికి ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరం చైర్మన్ డా. సంగాని రాజు, డైరెక్టర్లు బుక్యా శివ నాయక్, సునీల్, ప్రిన్సిపాల్ ఑ డైరెక్టర్ డా. మరోజు శ్వేత, ఆనంద్ కృష్ణారెడ్డి, మన్నె సతీష్, దేవీప్రసాద్ తదితరుల మార్గదర్శకత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై తగిన సూచనలు అందించారు. డా. మృదుక -- పీడియాట్రీషియన్, డా. శ్వేత -- గైనకాలజిస్ట్, డా. సంధ్య -- కార్డియాలజిస్ట్, డా. రమ్య -- ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్, డా. రజనీకాంత్ -- ఆర్ఎంఓ తమ విలువైన వైద్య సేవలను అందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు అవసరమైన వారికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం పట్ల పలువురు అభినందించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యతను తెలియజేయడం ద్వారా ఈ కార్యక్రమం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. సామాజిక బాధ్యతతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించిన ది మాస్టర్‌మైండ్స్ స్కూల్, శ్రీకర హాస్పిటల్స్ యాజమాన్యాన్ని స్థానికులు అభినందించారు.

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
గురువారం 10- 09 - 2026

# బొల్లారం 272 డివిజన్ ప్రజా సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం

పేద ప్రజల సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలి: కె.జే.ఆర్. ఆనంద్ కృష్ణారెడ్డి



**బొల్లారం, సెప్టెంబర్ 9 (తెలంగాణ అడ్డా -- జిన్నారం ప్రతినిధి):** బొల్లారం 272 డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు తీవ్రమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ శ్రీమతి జి. శ్రీజన, ఐఏఎస్ గారికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.జే.ఆర్. ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ బొల్లారం ప్రాంతంలోని పేద ప్రజలు, కార్మికులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తప్పనిసరిగా పరిష్కరించాలని కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు వారి భద్రత, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంలో ప్రధానంగా కేబిఆర్ కాలనీ, గాంధీనగర్, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లోని సుమారు 5 వేల ఇళ్లకు హౌస్ నంబర్ల మ్యూటేషన్‌ను ప్రస్తుత నివాసితుల పేర్లపై బదిలీ చేయడం, వీధి దీపాలను సక్రమంగా నిర్వహించడం, పారిశుధ్య సమస్యలను పరిష్కరించడం, ఇండస్ట్రీ ఏరియా, కేబిఆర్ కాలనీ, బీసీ కాలనీ, గాంధీనగర్‌లో పెండింగ్ రోడ్డు పనులను పూర్తి చేయడం వంటి అంశాలను ప్రస్తావించారు. అలాగే రోడ్లపై జరుగుతున్న విక్రయాల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారంగా పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో మోడల్ ప్రభుత్వ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. నైట్ షిఫ్టుల్లో పనిచేసే మహిళల భద్రత కోసం ప్రధాన ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పేద ప్రజలకు ఉపయోగపడేలా కులమతాలకు అతీతంగా శుభకార్యాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల నుంచి కాపాడి పార్కులుగా అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యంగా మాధవాని కుంటకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, మురుగునీరు కలవకుండా చర్యలు తీసుకుని మోడల్ చెరువుగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. వైకుంఠధామంలో అంత్యక్రియల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేయకుండా ఉచితంగా అంత్యక్రియలు నిర్వహించేలా సిబ్బందిని నియమించాలని, మరణ ధృవీకరణ పత్రాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్లు, ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయించాలని, బొల్లారంలో నూతన పోస్ట్ ఆఫీస్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఈఎస్ఐ సేవల పరిధిని బొల్లారం 272 డివిజన్‌కు అనుకూలంగా మార్చాలని, పేదలు, కార్మికుల ఆకలి తీర్చేందుకు రూ.5కే అన్నపూర్ణ భోజన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా బొల్లారం ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలను కఠినంగా అరికట్టాలని, పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

**కమిషనర్ సానుకూల స్పందన**

వినతిపత్రాన్ని స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ శ్రీమతి జి. శ్రీజన, ఐఏఎస్ గారు ఆనంద్ కృష్ణారెడ్డి వివరించిన ప్రజా సమస్యలను పరిశీలించి, బొల్లారం ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చిన కమిషనర్ శ్రీమతి జి. శ్రీజన గారికి బొల్లారం ప్రజల తరఫున కె.జే.ఆర్. ఆనంద్ కృష్ణారెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# గణేష్ నవశరాత్రి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి: నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి




**నల్గొండ బ్యూరో / తెలంగాణ అడ్డా:** వచ్చే గణేష్ నవశరాత్రి వేడుకలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు ప్రజలు, శాంతి కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని నల్గొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి కోరారు. శాంతి కమిటీ సభ్యులు మరియు గణేష్ ఉత్సవ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ప్రతి గణేష్ మండలాన్ని విధిగా ఆన్‌లైన్లో రిజిస్టర్ చేసుకోవాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి సమయాల్లోనూ మండపాల వద్ద తగిన భద్రత ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులను డీఎస్పీ ఆదేశించారు. మద్యం తాగి వేడుకల్లో పాల్గొనడం, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం, సౌండ్ సిస్టమ్స్ లేదా డీజే నిబంధనలను ఉల్లంఘించడం, ఇతరులకు అసౌకర్యం కలిగించే కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే వదంతులు, ఫేక్ న్యూస్, రెచ్చగొట్టే పోస్టులు, అభ్యంతరకర వీడియోలు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే కంటెంట్ ప్రచారం కాకుండా సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. నిమజ్జన ఊరేగింపు సందర్భంగా మళ్లింపులు, బారికేడింగ్, పార్కింగ్ సదుపాయాలతో కూడిన ప్రత్యేక ట్రాఫిక్ ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, వాహనదారులు పోలీసుల సూచనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. భక్తిశ్రద్ధలు, ప్రశాంతత, సౌభ్రాతృత్వంతో గణేష్ నవశరాత్రి వేడుకలు జరుపుకోవాలని, అందరి సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వేడుకలను ప్రశాంతంగా ముగిద్దామని డీఎస్పీ కె. శివరాం రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఆర్డీవో అశోక్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, శాంతి కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, పోలీస్ అధికారులు మరియు వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల ట్రాఫిక్ నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం అధికారులకు జాయింట్ సీపీ జోయల్ డేవిస్ దిశానిర్దేశం



**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** వచ్చే గణేష్ ఉత్సవాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ నిర్వహణ సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ పోలీస్ కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్ఓలు, ఏసీపీలు, డీసీపీలు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**ఈ సమావేశంలో చర్చించిన ప్రధాన అంశాలు:** గణేష్ విగ్రహాల ఆగమనం (రవాణా) మార్గాలను ముందుగానే గుర్తించి, ఆ రూట్లను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల ఎత్తును వెదురు బొంగుతో తనిఖీ చేసి, విగ్రహాల ఎత్తుతో సరిచూసుకోవాలి. ఒకవేళ అనుమతించిన పరిమితి కంటే విగ్రహం ఎత్తు ఎక్కువగా ఉంటే, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను లేదా డైవర్షన్‌లను ప్లాన్ చేయాలి. గత ఏడాదితో గణేష్ విగ్రహాల జాబితాను సరిపోల్చి వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. పండుగకు ముందే రోడ్లను ఆక్రమించి విగ్రహాలు విక్రయించే ప్రాంతాలను గుర్తించి తగిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలి. ఖైరతాబాద్ గణేష్ వద్ద వారాంతాల్లో భారీగా జనం గుమిగూడే అవకాశం ఉన్నందున, వాహనాల పార్కింగ్ మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. అవసరమైన అన్ని రకాల పరికరాలు, సిబ్బంది, లాజిస్టిక్స్ వివరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ గణేష్ మండపాల చుట్టూ సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణను నిశ్చిత చేయాలి. బందోబస్తు సిబ్బంది కోసం ప్రత్యేక పంపిణీ బృందాలను ఏర్పాటు చేసి సరైన భోజన వసతి కల్పించాలి. ప్రధాన నిమజ్జన మార్గాల వెంబడి తగిన మరుగుదొడ్ల సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. జీహెచ్‌ఎంసీ మరియు ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ రోడ్ల మరమ్మతులు, గుంతలు, ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలి. ముఖ్యమైన ఊరేగింపు మార్గాలు, ట్రాఫిక్ కదలికలను పర్యవేక్షించేందుకు డ్రోన్లను ఉపయోగించాలి. వ్యూహాత్మక ప్రాంతాలలో తగిన సైజు మరియు స్పష్టత కలిగిన రూట్ గైడెన్స్ సైనేజ్ బోర్డులను ఏర్పాటు చేయాలి. స్థిరమైన బారికేడింగ్ అవసరమైన ప్రాంతాలను గుర్తించి ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలి. నిమజ్జన సమయంలో అవసరమైన చోట జంక్షన్ల వద్ద సిమెంట్ బ్లాకులను తొలగించడం, తిరిగి అమర్చడానికి తగిన ప్రదేశాలను గుర్తించాలి. వీఐపీల రాకపోకల సమయంలో సురక్షితమైన ట్రాఫిక్ కదలికల కోసం తగినంత ప్రభావవంతమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలి. పాదచారులు సురక్షితంగా దాటేందుకు, ప్రజలకు తగిన సూచనలు అందించడానికి బడా గణేష్ తదితర ముఖ్యమైన విగ్రహాల వద్ద పబ్లిక్ అడ్రస్ (పీఏ) సిస్టమ్‌లను ఏర్పాటు చేయాలి. గణేష్ ఉత్సవాలు మరియు నిమజ్జన ఊరేగింపులు ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగేలా సంబంధిత శాఖలు, నిర్వాహకులతో సమన్వయంతో పనిచేసి గుర్తించిన పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# మండల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వారంతపు సమీక్ష

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి: ఎంపీడీఓ శ్రీలేఖ

ఉపాధి, జలసిరి, పారిశుధ్యం, ఇందిరమ్మ ఇండ్లపై అధికారులకు కీలక ఆదేశాలు



**తెలంగాణ అడ్డా వీర్నపల్లి, సెప్టెంబర్ 9:** మండలంలోని వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని వేగవంతం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) బజోజి శ్రీలేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో వారంతపు ప్రగతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ఉపాధి, నీటి సంరక్షణ, పారిశుధ్యం, గృహ నిర్మాణ పథకాల అమలుపై సమగ్రంగా సమీక్షించారు.

**జలసిరి, గ్రామీణ ఉపాధి పనులకు ప్రాధాన్యం**

కొత్తగా అమలులోకి వచ్చిన ఎదీ-+=ూవీ + పథకం కింద ప్రతి గ్రామంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూగర్భ జలాల పెంపునకు జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, పంట కుంటల నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. కూలీలకు 125 రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు వారపు వేతనాలు సకాలంలో అందేలా బయోమెట్రిక్, జీపీఎస్ ట్రాకింగ్‌ను పక్కాగా అమలు చేయాలని సూచించారు.

**సర్వే డేటా ఆధారంగా అర్హులకు సంక్షేమ పథకాలు**

SEEEPC సర్వే వివరాలను ఆధారంగా చేసుకుని గ్రామాల్లోని వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిశీలించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర బలహీన వర్గాల లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రాధాన్యత క్రమంలో అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి**

ప్రతి గ్రామాన్ని సంపూర్ణ పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దేందుకు వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల (×ఎనూ) నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించి, లబ్ధిదారులకు అందాల్సిన ప్రోత్సాహక నిధుల విడుదలకు అవసరమైన నివేదికలను సమర్పించాలని సూచించారు. గ్రామాల్లో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత (ఴణఖీ) నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో పారదర్శకత**

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని అర్హులైన పేదలకు ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థిక సహాయం సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల జాబితాలను పారదర్శకంగా పరిశీలించి, అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలను నిర్లక్ష్యం చేసే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ శ్రీలేఖ హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారులు (ఎంపీఓ), సహాయ ఇంజనీర్లు (ఏఈలు), పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తి పంట మధ్యలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న నిందితుడు అరెస్ట్.. రూ.12.50 లక్షల విలువైన మొక్కల స్వాధీనం



**ఆదిలాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** బోరిగాం గ్రామ శివారులో పత్తి పంట మధ్యలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న ఆడే కపిల్ అనే నిందితుడిని నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దాడిలో సుమారు 4 నుంచి 5 అడుగుల ఎత్తు పెరిగిన 125 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.12.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, నిందితుడు రవాణా కోసం ఉపయోగించిన స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని కూడా సీజ్ చేశారు. నిందితుడిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇచ్చోడా రూరల్ సీఐ సిహెచ్ రమేష్ మాట్లాడుతూ.. గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై ఎంతటి కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గంజాయి సాగు చేసేవారికి ప్రభుత్వ పథకాలు అందకుండా సిఫార్సు చేస్తామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రజలందరూ పోలీసులకు తగిన సహకారం అందించాలని ఆయన కోరారు.

## కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల అభ్యర్థుల వయోపరిమితి పెంచాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్



**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితిని పెంచాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారిని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ కోరారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు ఆయన వినతిపత్రం అందజేశారు. కరోనా పరిస్థితుల నేపథ్యం మరియు నోటిఫికేషన్ల ఆలస్యం కావడం వల్ల చాలా మంది నిరుద్యోగులు వయోపరిమితి మించిపోయి అర్హత కోల్పోతున్నారని సీఎంకు వివరించారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి గరిష్ఠ వయోపరిమితిని 34 ఏళ్ల నుంచి 36 ఏళ్లకు, ఎస్సై ఉద్యోగానికి 37 ఏళ్ల నుంచి 38 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగుల అభ్యర్థనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ తెలిపారు.

## ప్రజా సమస్యలను ఈరోజుసత్వరమే పరిష్కరించాలి

వన్ డే... వన్ వార్డు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.చంద్రారెడ్డి



**బొల్లారం జిన్నారం మున్సిపాలిటీ ప్రతినిధి /తెలంగాణ అడ్డ:** బొల్లారం డివిజన్ పరిధిలో ఏర్పాటుచేసిన వన్ డే..వన్ వార్డుకార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వి.చంద్రారెడ్డి గారు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్య సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆమెను కోరారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు. ప్రజల అవసరానికి అనుగుణంగా మౌలిక వసతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**మట్టి గణపతులు అందజేత**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్టించి వినాయక చవితి జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షిస్తూ డివిజన్ అధికారులు మట్టి గణపతి ప్రతిమలను ప్రజలకు అందజేశారు. ప్రతి ఒక్కరూ రసాయన రంగులతో తయారుచేసిన గణపతులను కాకుండా ఈకో ఫ్రెండ్లీ గణపతులనే పూజించి ప్రకృతిని కాపాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జైపాల్ రెడ్డి గారు, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ గారు, అసిస్టెంట్ కమిషనర్ నర్సింలు గారు, ఆనంద్ రావు గారు, రాయుడు గారు, మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ గారు, స్థానిక నాయకులు సంపత్ రెడ్డి గారు, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు గారు, వెంకటయ్య గారు, మాజీ వార్డ్ మెంబెర్ భాస్కర్ గారు, సురేష్ గారు, నవీన్ గారు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## పత్తి పంట సమగ్ర సస్యరక్షణ సాంకేతికతపై రైతులకు అవగాహన





**తెలంగాణ అడ్డా న్యూస్, (భద్రాద్రి జిల్లా ప్రతినిధి):** మణుగూరు మండలం అన్నారం గ్రామం లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో “ఆత్మ” కార్యక్రమం ద్వారా రైతు కముజు చంద్ర మోహన్ పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ (ఐ పి ఎం) సాంకేతికతపై ప్రదర్శన ( డెమో) నిర్వహించినట్లు మణుగూరు వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పత్తి పంటలో చీడపీడల నియంత్రణకు రసాయనిక పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ, ఫెరోమోన్ ట్రాప్స్, స్టిక్కీ ట్రాప్స్, స్టెమ్ అప్లికేషన్, వేపనూనె తదితర ఐ పి ఎం పద్ధతులను ఉపయోగించే విధానాన్ని క్షేత్రస్థాయిలో ప్రదర్శించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే రైతులకు అవసరమైన ఐ పి ఎం ఇన్‌పుట్స్‌ను కూడా అందజేశారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించి పత్తి పంటలో చీడపీడలను సమర్థ వంతంగా నియంత్రించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.తాత రావు, ఆత్మ కమిటీ చైర్మన్ అవుల సర్వేశ్వరరావు, వ్యవసాయ అధికారి వి. రాహుల్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి డా. కొమరం లక్ష్మణ్ రావు పాల్గొని రైతులకు పత్తిలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కుర్రి చలపతి రావు, రైతులు బత్తుల శ్రీను, జాను తదితరులు పాల్గొన్నారు.

EDITOR, PUBLISHER, OWNER BYGADDI NARESH Published at D.No: 3-82, Rathnampeta, Vilasagar, Rajanna Sirisilla, Karimnagar District, Telangana State pin—505524. Printer Sanam Venkata Rajasekhar, Printed at Arunodaya Printers D.No : 33-5-9, 2nd floor, , Papaiah Street, Seetharamapuram , Vijayawada, Krishna District, Andhra Pradesh pin-52002 Email Telanganadhairyamnewspaper@gmail.com, Cell :9441260616. RNI No: TGTEL/25/A0986